17వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
అమరావతి
మంగళవారం 19 డిసెంబర్ 2023 పేజీలు 8

## ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం



- సీఎం జగన్ వెల్లడి
- పేదవాడికి మెరుగైన కార్పొరేట్ వైద్య
- వైద్యం ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తించేలా మార్పులు
- రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** "డాక్టర్ వైయస్ఆర్ ఆరోగ్యశ్రీని ప్రతి పేదవాడికి మరింత చేరువ చేస్తూ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. 2

# నమ్మకానికి.. అమ్మ!



**'తమలపాకుతో నువ్వొకటంటే తలుపు చెక్కతో నేను రెండంటా ' అన్న చందాన నోరేసుకొని జబ్బలు చరుచుకుంటున్న నేటి రాజకీయాల్లో సౌమ్యురాలిగా, మృదుస్వభావిగా ... విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తూ మేకతోటి సుచరిత నూతన ఒరవడిని సృష్టించారు. కరుడుగట్టిన నేటి రాజకీయాల్లో సుచరిత ఒక ఆజాత శత్రువు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకురాలు. ఆమె నడత, రాజకీయ జీవితం భావితరాలకు ఆదర్శనీయం. ప్రత్యర్థులు సైతం సలాం కొట్టే వ్యక్తిత్వం ఆమెది. తను నమ్మిన సిద్ధాంతానికి, ఇచ్చిన మాటకు కట్టుబడి వుండే నిఖార్సయిన నాయకురాలు. నమ్ముకున్న ప్రజలను అమ్మగా అక్కున చేర్చుకొని ఆదరించిన ఆదర్శ మూర్తి. అణగారిన వర్గాల బాగోగుల కోసం అహర్నిశలు పాటుపడిన దయామయి. తనను నమ్ముకున్న కార్యకర్తలకు, నాయకులకు తగిన ప్రోత్సాహం, న్యాయం చేసేందుకు శాయశక్తులా కృషి చేసిన లీడర్. వైసీపీ శ్రేణుల నమ్మకానికి ఆమె నిలువెత్తు నిదర్శనం.**

- రాష్ట్ర రాజకీయాల్లో సుచరిత ఒక అజాత శత్రువు
- మంచితనానికి వన్నె తెచ్చిన మనసున్న రాజకీయ నేత
- ఆమె రాజకీయం సువర్ణాక్షరాలతో లిఖించదగిన సుచరిత్ర
- నమ్ముకున్న నాయకత్వానికి అండగా నిలిచిన దార్శనికురాలు
- అణగారిన వర్గాలను అక్కున చేర్చుకొని ఆదరించిన దయామయి
- ఆమె నడత, రాజకీయం భావితరాలకు ఆదర్శనీయం
- వైసీపీ శ్రేణుల నమ్మకానికి ఆమె నిలువెత్తు నిదర్శనం
- నమ్మిన సిద్ధాంతానికి, ఇచ్చిన మాటకు కట్టుబడి వుండే పర్ఫెక్ట్ లీడర్
- మా సుచరితమ్మ వేరే చోటుకు వెళుతున్నారంటూ వివిధ వర్గాల్లో నిర్వేదం
- సుచరిత నియోజకవర్గం మార్పుతో ప్రత్తిపాడు వైసీపీ శ్రేణుల్లో నిరుత్సాహం
- మనసున్న లీడర్ మాకు ఎమ్మెల్యేగా వస్తున్నారని తాడికొండ వైసీపీలో ఉత్సాహం

**గుంటూరు మేజర్ న్యూస్ :** రాజకీయ నాయకులకు ఎత్తుకు పై ఎత్తులు వేయడం. ప్రత్యర్థులను నిర్వీర్యం చేద్దామనే ధ్యాస..ధనాపేక్ష సర్వసాధారణంగా వుంటాయి. రాజకీయాల్లో రాణించాలి అంటే నోరేసుకొని ప్రత్యర్థులను నిలువరించాలి. తిమ్మిని బొమ్మిని చేయాలి. కడుపులో కత్తులు పెట్టుకొని కూడా చిద్విలాసంతో ఆలింగనం చేసుకోవాలి. ఆనక కత్తులు దూస్తూ వుండాలి. కాగా, మాజీ హోం మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వ్యవహార శైలి సగటు రాజకీయ నాయకులకు భిన్నంగా ఉంటుంది. తగిన గుర్తింపు నిచ్చి నమ్మి ఎన్నుకున్న ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు అవకాశం కల్పించాడని భావిస్తారు. ఎదుటి వారిలోని అవలక్షణాలు పక్కన పెట్టి వారిలోని మంచితనాన్ని మాత్రమే గుర్తించి ప్రేమగా పలకరించే మనస్తత్వం ఆమెది. డా. బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు, జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సుచరిత నమ్మిన మిగతా 2లో

## విద్యుత్తును పొదుపుగా వాడాలి

ఇంధన వనరులను భావితారాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

గుంటూరు జిల్లా కలెక్టర్ పిలుపు 2లో



## ప్రజల ఆరోగ్య భద్రతకు వేలాది కోట్లు ఖర్చు

- జిల్లాలో డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 427 కోట్ల ఖర్చుతో చికిత్సలు, శస్త్రచికిత్సలు
- వ్యయపరిమితి రూ. 25 లక్షల పెంపుతో పాటు పథకంపై అవగాహన కల్పించేందుకు మెగా డ్రైవ్
- 5,36,592 స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ :** పేద, మధ్యతరగతి ప్రజలెవరూ వైద్యం కోసం అప్పులపాలవకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మిగతా 5లో...

# ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం

(మొదటిపేజీ తరువాయి)

వైద్యం కోసం ఏ పేదవాడు అప్పులపాలు కాకూడదనే తాపత్రయంతో గతంలో ఎప్పుడూ, ఎవరూ చూడనంతగా మార్పులు తీసుకువచ్చాం. ఉచిత వైద్యం పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం.. దేశ చరిత్రలోనే మనందరి ప్రభుత్వ నిర్ణయం ఒక చరిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుంది" అని సీఎం జగన్ అన్నారు. ఇవాల్టి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందని, కార్డుల పంపిణీతో పాటు ఆరోగ్యశ్రీ ఉచిత సేవలను ఎలా వినియోగించుకోవాలనే సందేహాలను ప్రజాప్రతినిధులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రతి ఇంట్లో ఆరోగ్యశ్రీ యాప్‌తో పాటు దిశ యాప్ కూడా ఇన్‌స్టాల్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సీఎం జగన్ సూచించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ, అవగాహన కార్యక్రమాన్ని సీఎం వైయస్ జగన్ లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హెల్త్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. "దేశంలో ఎక్కడా లేని విధంగా పేదవాడికి ఖరీదైన వైద్యం అందిస్తున్నాం. వైద్యం కోసం ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ కిందకు వస్తుంది. ఇక నుంచి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతున్నాం. ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్యను పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా 2 వేల 513 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నాం. ఏ పేదవాడు వైద్యం కోసం అప్పులు కాకూడదని అడుగులు వేస్తున్నాం" అని సీఎం జగన్ అన్నారు.

### నేటి నుంచి ప్రారంభం

ఇవాల్టి నుంచి ఏపీలో కొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ జరుగుతుందని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కార్డులో లబ్ధిదారుని ఫొటో, ఆరోగ్య వివరాలు ఉంటాయని వెల్లడించారు. ఈ ఆరోగ్యశ్రీ మార్పుల విప్లవాత్మకమైన మార్పులని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ సేవల్ని ప్రతీ ఒక్కరికీ విస్తరించాలన్నదే లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 1.4 కోట్ల మందిని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చామని, రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామని, పార్లమెంట్ స్థానానికి ఒక మెడికల్ కాలేజీ ఉండేలా ప్రణాళిక రూపొందించామిని వివరించారు. పేదవాడికి ఆరోగ్యశ్రీని మరింత చేరువ చేయడమే లక్ష్యమని, పేదలకు ఆరోగ్యశ్రీ ఒక వరం అని పేర్కొన్నారు.

### ప్రతీ ఇంటా ఆరోగ్యశ్రీ యాప్ ఉండాలి

ప్రతీ ఇంట్లో దిశ, ఆరోగ్యశ్రీ యాప్‌లు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల్లో పేషెంట్‌కు సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయని, క్యూఆర్ కోడ్ ద్వారా పేషెంట్ వివరాలు అన్నీ డాక్టర్లకు తెలుస్తాయిని చెప్పారు. ఆరోగ్య శ్రీ సేవల గురించి తెలియని వ్యక్తి ఎవ్వరూ ఉండకూడదని అధికారులను ఆద్దేశించారు. ఇప్పటికే డోర్ డెలివరీకి సంబంధించి ట్రయల్ రన్ స్టార్ట్ చేశామని, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స పొందిన వారికి మందులు ఉచితంగా డోర్ డెలివరీ చేస్తామని చెప్పారు.



"మనం అధికారంలోకి రాకముందు కేవలం 1,059 ప్రొసీజర్లకు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధి పరిమితమై ఉండేది. మనం అధికారంలోకి వచ్చిన తరువాత చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటితే చాలు ఆ పేదవాడు ఇబ్బందిపడే పరిస్థితి రాకూడదు.. అటువంటివన్నీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావాలి.. ఏ పేదవాడు కూడా అప్పులపాలయ్యే పరిస్థితి ఉండకూడదనే తపన, తాపత్రయంతో ప్రతి అడుగు వేస్తూ ప్రొసీజర్స్‌ను అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2,300 ప్రొసీజర్లకు తీసుకెళ్లాం.. తరువాత 3,257 ప్రొసీజర్లతో ఈరోజు ఆరోగ్యశ్రీ నడిపిస్తున్నాం. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కేవలం 748 ఆస్పత్రులకు మాత్రమే పరిమితమైన ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు ఈరోజు 2,513 ఆస్పత్రులకు విస్తరించడం జరిగింది. మన రాష్ట్రంలోనే 2,309 ఆస్పత్రులు, హైదరాబాద్‌లోని 85 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఎంప్యానల్ చేశాం. బెంగళూరులో 35 ఆస్పత్రులు, చెన్నైలో 16 ఆస్పత్రులు.. మొత్తంగా 204 ఇతర రాష్ట్రాల్లోని నగరాలను ఎంప్యానల్ చేసి, గతంలో మాదిరిగా కాకుండా 716 ప్రొసీజర్లను కూడా బయట రాష్ట్రాల్లోని సూపర్ స్పెషాలిటీ సర్వీసెస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. గతంలో కేవలం 748 ఆస్పత్రులకు మాత్రమే, కేవలం హైదరాబాద్‌లో 72 ఆస్పత్రుల్లో మాత్రమే పరిమితమై ఉండేది. రెండు కలిపినా కూడా కేవలం 820 ఆస్పత్రులకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని నేడు.. ఏకంగా 2,513 ఆస్పత్రులకు విస్తరింపజేశాం" అని సీఎం వివరించారు.

### ప్రభుత్వం వైద్య రంగ రూపురేఖలు మార్పు

రాష్ట్రంలో ఎలాంటి పరిమితులు లేకుండా ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నామని, కాన్సర్‌లాంటి వ్యాధులకు సైతం ఆరోగ్య శ్రీ వర్తింపజేశామని సీఎం చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 104,108 వాహనాలు కూడా సరిగ్గా వచ్చేవి కావని, ఇవాళ ఏకంగా 104 ,108 కింద 2,200 వాహనాలు తిరుగుతున్నాయని వివరించారు. గతంలో మండలానికి ఒక 104,108 కూడా లేని పరిస్థితి ఉండేదని, గత ప్రభుత్వ హయాంలో సరిగ్గా డాక్టర్లు కూడా లేని పరిస్థితని, ఇవాళ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామి చెప్పారు. ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ. 4వేల 100 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఏటా రూ.1000 కోట్లు కూడా ఖర్చు చేసేది కాదని, అలాగే ఇప్పుడు ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచామని అన్నారు. గత ప్రభుత్వం రూ.5 లక్షలు కూడా ఇచ్చేది కాదని, జాతీయ స్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత 61శాతం ఉంటే.. రాష్ట్రంలో 3.3శాతం మాత్రమే స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత ఉందని, వీటినికూడా ఖాళీలు లేకుండా చూసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం జగన్ చెప్పారు. మన ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆరోగ్యశ్రీ సేవలను మెరుగు పరుస్తూ ఇప్పటికే రూ.14,439 కోట్లు ఖర్చు చేశాం. ఇది సంవత్సరానికి రూ.4,400 కోట్లు. వైద్యం కోసం పేదవాడు ఇబ్బందిపాలు కాకూడదు, అప్పులపాలు కాకూడదనే తపన, తాపత్రయంతో చేశాం.

గతంలో ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు తక్కువే. గతంలో ఐదు సంవత్సరాలు కలిపి ఆరోగ్యశ్రీ సేవలు అందుకున్నవారి సంఖ్య 22.32 లక్షల మంది మాత్రమే. మనందరి ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ల కాలంలో ఆరోగ్యశ్రీ సేవలు 53 లక్షల మందికి అందుబాటులోకి వచ్చాయి.

### రెండోవ దశ ఆరోగ్య సురక్ష ప్రారంభం

జనవరి 1వ తేదీ నుంచి ఆరోగ్య సురక్ష ఫేస్- 2 మొదలవుతుందని సీఎం తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఆరు నెలలకు ఒకసారి మెగా హెల్త్ క్యాంప్ రిపీట్ అవుతుందని, ఆరోగ్య సురక్ష ఫేజ్ – 2 కింద ప్రతి మండలంలోనూ, ప్రతి వారం ఒక గ్రామంలో హెల్త్ క్యాంపు జరుగుతుందని ప్రతి వారం ఒక మండలంలో మంగళవారం, మరో మండలంలో శుక్రవారం జరుగుతుందని, వార్డుల పరిధిలో ప్రతి బుధవారం క్యాంపు జరుగుతుందని తెలిపారు.

ఫేస్–1 ద్వారా 50 రోజులు కార్యక్రమం నిర్వహించామని, దీని వల్ల దాదాపుగా 60,27,843 మంది హెల్త్ క్యాంపులకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారని, ఆరోగ్య సురక్ష వల్ల ప్రతి ఇంటికి వెళ్లి 6,45,06,018 వైద్య పరీక్షలు చేయడం జరిగిందని, ప్రివెంటీవ్‌కేర్‌లో కొత్తగా 2.40 లక్షల మందికి బీసీ లక్షణాలు కల్పించాయని, రీకన్ఫర్‌మేటరీ టెస్టులు కూడా చేసి 56,648 మందికి మందులు కూడా ఇవ్వడం జరిగిందని, 1,48,904 మందికి డయాబెటిస్ ఉన్నట్లు ధ్రువీకరణ జరిగిందని ఇందులో రీకన్ఫర్‌మేటరీ టెస్టులు కూడా అయిపోయి.. 39,684 మందికి మందులు కూడా స్టార్ట్ చేశామని వివరిరంచారు.

ఆరోగ్య సురక్ష చాలా ప్రాముఖ్యత కలిగినదని అందరూ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనే వారి ఫోన్‌లకు 6 నిమిషాల వీడియో కూడా పంపించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డుదారులందరికీ పూర్తి అవగాహన కల్పించే వీడియో మెసేజ్‌ను చూపించాలని, వీడియో మెసేజ్ ద్వారా అన్ని విషయాలు తెలుస్తాయని, వారికి ఆ వీడియో మెసేజ్ పంపిస్తే ఎప్పుడైనా వినాలనుకున్నప్పుడు వింటారని సీఎం ఈ ప్రక్రియను వివరించారు.

# నమ్మకానికి... అమ్మ..!

(మొదటిపేజీ తరువాయి)



సిద్ధాంతం కోసం.. అవకాశం కల్పించిన నాయకుడి కోసం ఎందాకైనా మనసా వాచా కట్టుబడి వుండటం ఆమె తత్వం.

**విలువలతో కూడిన రాజకీయం...**

సాధారణంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో అజమాయిషీ చేయడం, ప్రతి వ్య వహారంలో వేలు పెట్టడం, పనుల్లో పర్సెంటేజీలు, అక్రమార్జన వంటివి చేస్తుం టారని నిత్యం వినిపించే మాట. అయితే సుచరిత మూడు పర్యాయాలు ఎమ్మె ల్యేగా, రాష్ట్ర హోంమంత్రిగా పనిచేసినా.. ఏనాడు ఇటువంటి ఆరోపణలు ఎదు ర్కొనలేదు. ప్రజలకు సేవే పరమావధిగా తనపని తాను చేసుకుపోతుంటారు. ప్రజలు ఏరికోరి గెలిపించారు వారికి సాధ్యమైన సేవ, చేతనైన సాయం చే యాలనే లక్ష్యంతో పనిచేస్తుంటారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమ యంలో మాత్రమేనని ... ఎన్నికలు అయ్యాక స్వపక్షం,విపక్షం అనే తేడా లేకుం డా అన్ని వర్గాలకు న్యాయం చేయాలని సుచరిత చెబుతుంటారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఆమె చేసిన సేవలు,పొందిన మన్ననలే ఇందుకు నిదర్శనం.

**తాడికొండలో ఉత్సాహం.. ప్రత్తిపాడులో నిరుత్సాహం...**



ప్రత్తిపాడు నియోజకవర్గం భౌగోళికంగా, విస్తీర్ణంలో పెద్ద నియోజకవర్గం. గుంటూరు రూరల్ మండలంలోని జొన్నలగడ్డ నుండి మొదలు కొని బాపట్ల జిల్లా సరిహద్దు వరకు విస్తరించి ఉంటుంది. వయస్సు రీత్యా ఇంత పెద్ద నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం కష్టంగా మారడంతో సుచరిత నియోజకవర్గం మార్పు కోరుకున్నట్లు తెలిసింది. దీనికి స్పందించి సుచరితను తాడికొండలో పోటీ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశించారని చెబుతున్నారు. అయితే సుచరిత నియోజకవర్గ మార్పును అక్కడి వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి. గ్రామ,మండల,జిల్లా స్థాయిలో మమ్మల్ని నాయకులుగా ప్రోత్సహించి పదవులు కట్టబెట్టిన నాయకురాలు వేరే నియోజకవర్గానికి వెళ్లడంతో ప్రత్తిపాడు వైసీపీ శ్రేణుల్లో నిరుత్సాహం ఏర్పడింది. కొత్తగా వచ్చిన నాయకుడు తమకు సరైన ప్రాధాన్యత, స్థానం కల్పిస్తారో లేదో అనే మీమాంసలో వున్నారు. మరోవైపు మచ్చలేని నాయకురాలు,పారదర్శకతకు పెద్దపీట వేసే సుచరిత తమ ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చినందుకు తాడికొండ వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం, నూతనుత్తేజం నెలకొంది.

# విద్యుత్తును పొదుపుగా వాడాలి



**భావితారాలకు ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది**

**గుంటూరు జిల్లా కలెక్టర్ పిలుపు**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** విద్యుచ్ఛక్తి ఆదాను ప్రతి ఒక్కరూ పాటించి భావితారాలకు ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత వుందని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలక్టరేట్ నుండి జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలు డిసెంబర్ 14 వ తేదీ నుండి 20 వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సంస్థ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గుంటూరు పట్టణంలో విద్యుచ్ఛక్తి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీని ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో ఇంధన వనరులు పరిమితంగా ఉన్నాయని , అయితే జనాభా పెరుగుదల వల్ల విద్యుచ్ఛక్తి అవసరాలు పెరుగుతున్నాయన్నారు. ఉన్న వనరులను జాగ్రత్తగా వాడుకొని భావితరాలకు అందించాల్సి వుందన్నారు. తక్కువ విద్యుచ్ఛక్తితో నడిచే అత్యాధునిక ఫ్రిడ్జ్ , టీవీ, ఏసీలు ప్రజలు వాడే విధంగా అవగాహన కలిగించాలన్నారు. అందువల్ల విద్యుచ్ఛక్తి వినియోగం ఆదా అవుతుందన్నారు. రాష్ట్రంలో సాధారణ బల్బుల స్థానంలో ఎల్ ఈ డి బల్బులు వాడకం వల్ల 30 శాతం విద్యుచ్ఛక్తి ఆదా అవుతున్నదన్నారు. అవసరం అయిన సందర్భంలో తప్ప మిగిలిన సందర్భాలలో విద్యుత్ వినియోగం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుచ్ఛక్తి వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అనేక విప్లవాత్మకమైన చర్యల వల్ల జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు 2022 – 2023 గెలుచుకోవడం జరిగిందని తెలిపారు. విద్యుచ్ఛక్తి ఆదాలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యుచ్ఛక్తి ఆదాపై ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు సర్కిల్ ట్రాన్స్కో పర్యవేక్షక ఇంజనీర్ మురళీకృష్ణ యాదవ్ , సీఆర్డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస బాబు, డియం అండ్ హెచ్ ఓ డా. శ్రావణ బాబు , డీఈఈలు , ఏఈఈ లు పాల్గొన్నారు.

# అక్కా చెల్లెమ్మలంటూనే అణచివేస్తారా?



**గన్నవరం, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ :** సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని శాంతియుతంగా సమ్మె చేస్తుంటే అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపుతున్నారని, అంగన్వాడీ కార్యకర్తల సత్తా ఏంటో వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చూపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లం వెంకటేశ్వరరావు అన్నారు. గన్నవరం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెను అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం ఉద్ధృతం చేశారు. కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసనలు తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చి కనీస వేతనం అమలు చేసి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఊరూర తిరిగిన జగన్ అక్క చెల్లెమ్మలు అంటూ ముద్దాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు నెరవేర్చకుండా గొంతు నొక్కే కార్యక్రమం చేస్తున్నాడని మండిపడ్డారు. నాలుగేళ్లుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు వివిధ రూపాల్లో వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినా పాలకుల్లో కనీస స్పందన కరువైందన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో నిత్యావసరాలు, వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్, విద్యుత్ ఛార్జీలు బాగా పెరిగాయన్నారు. సంపూర్ణ పోషణ అమలునకు ప్రభుత్వం చెల్లించే నగదు ఎంత మాత్రం సరిపోవడం లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాల అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీల కోపానికి గురికాకుండా ఉండాలంటే వెంటనే వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సిఐటియు నాయకులు బేతా శ్రీనివాసరావు, పిల్లి మహేష్ మాట్లాడుతూ... పోరాటం చేయడం అంగన్వాడీలకు కొత్త కాదన్నారు. గతంలో పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తే గుర్రాలతో తొక్కించారని, అందుకు ఆ ప్రభుత్వాన్ని ఇంటికి గుర్తు చేశారు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సమస్యలు పరిష్కరించమంటే ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తూ, అంగన్వాడీల ఉద్యమంపై ఉక్కు పాదం మోపాలని ప్రయత్నిస్తున్నారని దీనికి బెదిరేస్థితిలో కార్యకర్తలు లేరని చెప్పారు. ఎన్ని ఒత్తిడిలకు గురిచేసిన ఆధరం...బెదరం.. అనే ఏకైక నినాదంతో కార్యకర్తలు ఉద్యమంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం నాయకులు రమాదేవి, సాంబ, లక్ష్మి, సిఐటియు నాయకులు బెజవాడ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆల్ ఇండియా ఫెంక్షనర్స్ డే

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఆల్ ఇండియా ఫెంక్షనర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆల్ ఇండియా పెంక్షనర్స్ దేను పురస్కరించుకుని పెంక్షనర్స్ అసోసియేషన్ ఎం రామకృష్ణ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ మాజీ అధ్యక్షులు కె నాగేశ్వరరావు మాట్లాడారు. పెంక్షనర్స్ డే గురించి డి ఎస్ నకర కృషి అభినందనీయం అన్నారు. నేడు పెంక్షనర్స్ ఎదుర్కోంటున్న సమస్యల గురించి అతిథులుగా విచ్చేసిన ఉపాధ్యాయ పత్రికా సంపాదకులు వై నేతాంజనేయ ప్రసాద్, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె సుధాకరరావులు మాట్లాడారు. కోసాధికారి ఆర్ నాగేశ్వరరావు ఆర్థిక నివేదికను సమర్పించారు. 1 వ తేదినే పెంక్షన్ ఇవ్వాలని డి ఆర్ బకాయిలు వెంటనే ఇవ్వాలని తగ్గించిన క్వాంటమ్ ఆఫ్ పెంక్షన్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యోగులైన బి ఘంటేశ్వరమ్మ, పి బేబి, సి హెచ్ విష్ణు వర్ధన్‌రావు, కె అరుణ ప్రసాద్, వేముల శేషగిరిరావు, ఎన్ వీరరాఘవయ్యలను దుసాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

## అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు



**మొవ్వ మేజర్ న్యూస్:** పలు నేరాల్లో నిందితులైన అంతర్రాష్ట్ర దొంగలను కూచిపూడి పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేసినట్లు గుడివాడ డిఎస్పి పి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం కూచిపూడి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీహార్ రాష్ట్రం భాగల్పూర్ జిల్లాకు చెందిన దీపక్ కుమార్, జగన్నాథ్ సాహులు ఈ ఏడాది మార్చి 28వ తేదీన పెదపూడి గ్రామంలో ఇంట్లో ఉన్న మహిళకు వెండి బంగారం వస్తువులకు మెరుగు పెడతామంటూ మాయమాటలు చెప్పి, మెరుగుపెట్టేందుకు పసుపు కావాలని తీసుకురమ్మని నమ్మించి మహిళ ఇచ్చిన బంగారపు వస్తువులతో పరారయ్యారు.

దీనిపై ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ పి జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డి.ఎస్.పి పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పామర్రు సీఐ వి సుబాకర్ నేతృత్వంలో కూచిపూడి ఎస్సై డి సందీప్ సారథ్యంలో రెండు బృందాలు ఏర్పడి ఎట్టకేలకు చోరీ కేసును ఛేదించారు. ఈనెల 17వ తేదీన కూచిపూడి శివారు బార్లపూడి పెట్రోల్ బంకు



సమీపంలో దీపక్ కుమార్ జగన్నాథ్ సాహూలను ఎస్ఐ సందీప్ అరెస్ట్ చేశారు. వీరి ఇరువురు నిందితులు కృష్ణ, ఎన్టీఆర్, కోనసీమ, జిల్లాలలో ఆరు కేసులు నమోదయ్యాయని అంతేకాకుండా హైదరాబాదులో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి ఆరు కేసుల్లో 16 లక్షలు విలువ చేసే 263 గ్రాముల బంగారంతో పాటు ఒక బైకు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి శ్రీకాంత్ తెలిపారు.

# వంట ఏజెన్సీ మహిళలూ పోరాటాల్లోకి రావాలి

**గన్నవరం, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ :** సమస్యల పరిష్కారం కోసం వంట ఏజెన్సీ మహిళలూ పోరాటంలోకి రావలసిన సమయం వచ్చిందని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో గన్నవరం డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. సంఘ నాయకులు లలిత కుమారి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వంట ఏజెన్సీ కార్మికులకు మూడు నెలలుగా బిల్లులు రావడం లేదనీ, అప్పులతో వంట చేసి పిల్లలకు పెడుతున్నారని తెలిపారు. అందరూ నిరుపేద కార్మికులు కావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతే బయటకు రావడం కష్టమవుతుందన్నారు. అందువల్ల ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఉద్యమంలోకి రావాలన్నారు. వంట ఏజెన్సీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సమ్మక్క మాట్లాడుతూ.. జిల్లాలో వందలాదిమంది కార్మికులు వంట ఏజెన్సీ పనులు చేస్తూ పిల్లలకు రుచిగా ఆహారం వండి పెడుతున్నారని చెప్పారు. పిల్లల కడుపు నింపుతున్న కార్మికుల కడుపులు మాత్రం మాడిపోతున్నాయని, నెలవారీగా బిల్లులు చెల్లించకపోవడంతోసరుకుల దుకాణాల్లో అప్పులు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.షాపుల నిర్వాహకులు ఒకటి రెండు నెలలు మాత్రమే అప్పులు పెట్టి ఆ తర్వాత మా వల్ల కాదని చేతులు ఎత్తేస్తున్నారని, దీంతో ఇంట్లో భర్త తెచ్చిన డబ్బులను తీసుకువచ్చి వంట చేస్తున్నట్లు వివరించారు. కొంతమంది బయట నూటికి రెండు రూపాయలు అప్పులు తెచ్చి వంట చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్లో వంట చేసేవారికి వేలాది రూపాయలు బిల్లులు రూపేనా ఆగిపోయాయని, ప్రభుత్వం ఇప్పటికైనా చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వంట ఏజెన్సీ కార్మికుల సమస్యలపై వచ్చేనెల 5వ తేదీన విజయవాడలో జరిగే ఆందోళన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సుధా, సిఐటియు నాయకులు తాతబ్బాయి పాల్గొన్నారు.





## విజయవంతంగా ఎన్ఐఐటీ విశ్వవిద్యాలయం విద్యావేత్తల సదస్సు 2వ ఎడిషన్

**విజయవాడ మేజర్ న్యూస్:** విజ్ఞాన సమాజంలోని అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఉన్నత విద్య, అభ్యాసంలో ఆవిష్కరణలను తీసుకురావాలనే లక్ష్యంతో స్థాపించబడిన ఫ్యూచర్ విశ్వవిద్యాలయం, ఎన్ఐఐటీ విశ్వవిద్యాలయం, ఇటీవల విద్యావేత్తల సదస్సు యొక్క రెండో ఎడిషన్‌ను విజయవంతంగా ముగించింది. ఈనెల 17న ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ, హైదరాబాద్‌లోని పాఠశాలల నుండి ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు ఒక అవగాహనతో కూడిన సెషన్‌ను నిర్వహించారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ప్రకాష్ గోపాలన్ సదస్సులో విశ్వవిద్యాలయం అందించే వైవిధ్యతను, విద్యావేత్తలను పరిచయం చేశారు.

## ఈ సీజన్‌లో అతిపెద్ద సేల్‌ను ప్రకటించిన లైఫ్‌స్టైల్




**గుంటూరు మేజర్ న్యూస్:** భారత దేశపు సుప్రసిద్ధ ఫ్యాషన్ కేంద్రంగా వెలుగొందుతున్న లైఫ్‌స్టైల్, అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సేల్'ను ప్రకటించింది. లైఫ్‌స్టైల్ వద్ద కొనుగోళ్లు జరిపిన వినియోగదారులు 50 శాతం వరకూ రాయితీ పొందడంతో పాటుగా మరెన్నో ఉత్సాహపూరితమైన డీల్స్‌ను తాజా శైలిలో అత్యున్నత ఫ్యాషన్ బ్రాండ్ల వ్యాప్తంగా పొందవచ్చు. ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్‌ల నుండి తాజా ట్రెండ్‌ల యొక్క విస్తృతమైన ఎంపికతో, లైఫ్‌స్టైల్ యొక్క సేల్ ఫ్యాషన్ ప్రియులకు వారి వార్డ్‌రోబ్‌లను సమున్నతం చేయడానికి గొప్ప అవకాశాన్ని అందిస్తుంది.

## బాలశివశంకర భగవాన్‌కు విశేష పూజలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాలశివశంకర్ భగవాన్‌కు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక, మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీపాయల నడుమ స్వయంగా వెలసిన బాలశివశంకర్ భగవాన్‌కు దక్షిణాయనం, హేమంత్ ఋతువు, మార్గశివరమాసం, శుక్లపక్షం, షష్టితిధిని పురస్కరించుకుని కార్తీక మూడవ సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ, ఆలయ అర్చకులు కాళీభట్ల సుబ్బయ్యశాస్త్రి లు ముందుగా కృష్ణానదీజలాలలతో అభిషేకించి నవవిధ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి వారికి నాగవల్లి అర్చనతో పూజలు నిర్వహించారు. భక్తులు సుదీర్ఘ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలంయ ఆవరణలో గల గణపతి, కుమారస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి మ్రొక్కులు తీర్చుకున్నారు. అనంతరం 4 వేల మంది భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్ధ అన్నప్రసాదాలను స్వీకరించారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.

## మార్కెట్లోకి పారాచూట్ అడ్వాన్స్‌డ్ సంపూర్ణ హెయిర్ ఆయిల్




**విజయవాడ మేజర్ న్యూస్:** మారికో లిమిటెడ్ ప్రీమియం హెయిర్ న్యూరిష్‌మెంట్ బ్రాండ్ అయిన పారా చూట్ అడ్వాన్స్‌డ్, కేశ సంరక్షణలో సరికొత్త ఆవిష్కరణ, పారాచూట్ అడ్వాన్స్‌డ్ సంపూర్ణ హెయిర్ ఆయిల్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తీసుకువస్తోంది. పారాచూట్ అడ్వాన్స్‌డ్ సంపూర్ణ కోకోనట్ హెయిర్ ఆయిల్ వినియోగదారులకు ఒత్తైన, పొడవాటి, నల్లని జుట్టును అందించడంలో తిరుగులేని పరిష్కారాన్ని అందించడం ద్వారా శిరోజ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. ఈ తరహాలో మొట్టమొదటి రకం ఉత్పత్తి కొబ్బరి విశ్వసనీయమైన మంచితనాన్ని ఐదు ప్రత్యేక మూలికలైన ఉసిరి, మందార, అలోవెరా, మెంతి, కరివేపాకు వంటి సుసంపన్నమైన లక్షణాలతో మిళితం చేస్తుంది. ఈ నూతన ఉత్పత్తి శిరోజాలకు అదనపు సంరక్షణను అందిస్తుందని మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్థి పేర్కొన్నారు.



## న్యాయమైన కోర్కెలను ప్రభుత్వ పరిష్కరించాలి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హక్కుల సాధనకు అహింస పోరాటం చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు చరిత్ర సృష్టించారని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు వారి సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న నిరసన దీక్షలు సోమవారం 7 వరోజుకు చేరాయి. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్దతిలో గెలిచిన జగన్‌మోహన్‌రెడ్డి నియంతలను ఆదర్శంగా తీసుకుని పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా నిరంకుశ పాలన కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఒక వైపు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలియచేస్తూ సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వం అధికారులను పెట్టి తాళాలు పగులకొట్టించడం సరైన పద్దతి కాదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తల హక్కులను, సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ పోరాటంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఖచ్చితంగా విజయం సాధిస్తారని, లేకుంటే మూడు నెలల పాటు జగన్ స్పందించకపోతే టిడిపి, జనసేన ప్రభుత్వాలు రాగానే అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండల వెంకట్రామ్, అంగన్‌వాడీ కార్యకర్తల, యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## సంతృప్తి చెందేలా దరఖాస్తులను పరిష్కరించాలి



**జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం**

**స్పందనకు 134 అర్జీలు**

**కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ :** అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి 61, పోలీస్ శాఖకు సంబంధించి 20, మునిసిపల్, పట్టణాభివృద్ధి-10, డీఆర్‌డీఏ-12.. ఇలా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 134 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ అర్జీలను నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా ప్రత్యేకంగా దృష్టిసారించి.. క్షేత్రస్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని అమలుచేస్తోందని.. ఈ కార్యక్రమం అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు.

## విద్యార్థులచే సైన్స్ ఎగ్జిబిషన్



**కంచికచర్ల డిసెంబర్ 18 మేజర్ న్యూస్ :** మండల స్థాయి హైస్కూల్ యూపీ స్కూల్ విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు ఎంఈఓ బాలాజీ తెలిపారు. కంచికచర్ల జెడ్పీహెచ్ స్కూల్ నందు సోమవారం జరిగిన ఎగ్జిబిషన్లో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుల్ని డిస్ప్లే చేయటం జరిగిందన్నారు. వీటిల్లో ఎంపిక అయిన వారిని జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు కూడా ఈ ఎగ్జిబిషన్ కాంపిటీషన్ లో పాల్గొనే అవకాశం కల్పించారు మొత్తం మండల నుంచి ఆరుగురు ని ఎన్నిక చేసి జిల్లాకి పంపించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు ఎంఈఓ అభినందనలు తెలిపారు.



# క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు





**నందిగామ, డిసెంబర్ 18, మేజర్ న్యూస్:** పట్టణంలోని ఆర్ఎస్ గార్డెన్స్‌లో సోమవారం కేశినేని ట్రస్ట్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కేశినేని శివనాద్ (చిన్ని) సహకారంతో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నందిగామ నియోజకవర్గ పాస్టర్స్ గ్రాండ్ సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ సెలబ్రేషన్లో క్రిస్మస్ సందేశకులు రెవ. డాక్టర్ సిహెచ్ దైవ ప్రకాష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు స్వామిదాస్, నియోజకవర్గ పాస్టర్లు,తెదేపా ఎస్సీ సెల్ నేతలు,మహిళా నేతలు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, కేశినేని ట్రస్ట్ చైర్మన్, తెదేపా నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి గ్రాండ్ సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్‌లో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య, పలువురు వక్తలు మాట్లాడుతూ యావత్ ప్రపంచాన్ని సృష్టించిన దేవదేవుడు ఏసుక్రీస్తు,లోక రక్షకుడైన యేసు మానవాళి పాపాలు తొలగించేందుకు కన్యక గర్భమున జన్మించాడు.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మన దళిత జాతుల వారికి ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అందజేశాము.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో క్రిస్టియన్స్ బరియల్ గ్రౌండ్ ఏర్పాటు చేస్తే దాని ద్వారాగా ఇవాళ ఎంతోమంది దానిని ఉపయోగించుకుంటున్నారు. గత తెలుగు దేశ ప్రభుత్వ హయాంలో జెరుసలేమి యాత్రకు గవర్నమెంట్ సబ్సిడీ ఇచ్చేది అన్నారు. అదేవిధంగా క్రిస్టియన్స్ యువతకి ఉన్నత చదువుల నిమిత్తం కోచింగ్‌కి ఉచితంగా శిక్షణ ఇచ్చాము. దళితులకు సబ్సిడీ లోన్లు ఇచ్చేవాళ్లం,యువత ఉన్నత చదువుల నిమిత్తం విదేశీ విద్య అనే పథకం ద్వారా ఎంతో మందికి ఆనాడు తెలుగు దేశ ప్రభుత్వ హయాంలో లబ్ది చేకూరింది. క్రిస్టియన్ ముసుగులో జగన్మోహన్ రెడ్డి క్రైస్తవులను మోసం చేశాడు.క్రిస్టియన్ కన్వెన్షన్ సెంటర్ కొన్ని కోట్ల రూపాయలతో మన అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తే ఈ ప్రభుత్వం ఏర్పడగానే దానిని నిలిపివేశారు.ప్రతి ఒక్కరూ గతాన్ని, అలానే ప్రస్తుతం వర్తమానంలో జరుగుతున్న వాటిని ప్రతి ఒక్కరు గుర్తించి గమనించాలి. ప్రతి ఒక్క క్రైస్తవ సోదర సోదరీమణులకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు ప్రతిఒక్కరిపై ఆ దేవదేవుని ఆశీస్సులు సదా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఉర్ల మోహన్ రావు, నియోజకవర్గ క్రిస్టియన్స్ అధ్యక్షులు మందా స్వామి, మండల, గ్రామస్థాయి తెదేపా సెల్ ఎస్సీ నేతలు, దైవ సేవకులు జనసేన, తెలుగుదేశం అభిమానులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.



## నష్ట పరిహారం నేరుగా కౌలు రైతుల పేరునే ఇవ్వాలి

**కంచికచర్ల డిసెంబర్ 18 మేజర్ న్యూస్ :** కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన కౌలు రైతులకు పంట నష్టపరిహారం నేరుగా కౌలు రైతులకు అందించాలని ధర్నా సోమవారం నిర్వహించారు . ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ డిసెంబర్ 5, 6 తేదీల్లో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలకు కౌలు రైతుల పేరునే నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రాఫ్ నమోదు కాని రైతులకు కూడా నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాను వల్ల పూర్తిగా దెబ్బతిని రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక వ్యవసాయ అధికారి కి వినతిపత్రం అందజేశారుఈ కార్యక్రమంలో కొత్తపేట ఆతుకూరు చెవిటికల్లు గ్రామ కౌలు రైతులు చలమల శ్రీను, కూసు పుల్లారావు ,వెంపరాల సుబ్బారావు, దొండపాటి నారాయణరావు ,ముద్ర వీరబ్రహ్మం, సయ్యద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## గన్నవరం డిపో నుండి శ్రీ వైష్ణవ దర్శిని



**గన్నవరం, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ :** ధనుర్మాసం లో ప్రతి శనివారం ఒకే రోజు ద్వారకాతిరుమల లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ని, వాడపల్లి లో శ్రీ వేంకటేశ్వర స్వామి ని మరియు అన్నవరం లో శ్రీ సత్యనారాయణ స్వామి నీ దర్శించుకునే అవకాశం. గన్నవరం డిపో నుండి ప్రతి శనివారం ఉదయం 04.00 గంటలకు బస్సు బయలుదేరి ముందుగా ద్వారకాతిరుమల వెళ్లి అక్కడ శ్రీ వేంకటేశ్వర స్వామి ని దర్శించుకుని , తర్వాత వాడపల్లి వెళ్లి అక్కడ స్వామి వారిని దర్శించుకుని, తర్వాత అన్నవరం వెళ్లి అక్కడ శ్రీ సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకుని తిరిగి రాత్రికి గన్నవరం చేరును. ఎక్స్ ప్రెస్ బస్ చార్జీ: రు 700 /- 2 ౦ 2 పుష్ బ్యాక్ సీట్లు గల అల్ట్రా డీలక్స్ బస్ చార్జీ: రు 850 /- ఒకే గ్రామం నుండి 35 మంది వున్నచో అదే గ్రామంలో ఎక్కించుకొని మరల అదే గ్రామంలో దించబడును. వివరములకు ఈ దిగువ ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరు అని గన్నవరం డిపో మేనేజర్ తెలియజేసినారు. 8790996090 7382905633.

## ముఖ్యమంత్రి వీడియో కాన్ఫిడెన్స్‌లో కమిషనర్



**నందిగామ, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆరోగ్య శ్రీ ద్వారా 25 లక్షల వరకూ ఉచితవైద్యం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టే కార్యక్రమంనకు వీడియో కాన్ఫిడెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎవరికి ఎలాంటి వైద్యం అవసరమైనా ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే 25 లక్షల వరకూ చికిత్స ఉచితంగా లభించనుంది. అంతేకాదు ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్న వారికి మళ్లీ డాక్టర్ దగ్గరకు వెళ్లి చెకప్ చేయించుకునేందుకు రవాణా ఛార్జీల కింద రూ.300 చెల్లించడం జరుగుతుంది అని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారి చేశారు. ఈ కార్యక్రమంతో పాటు కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలోని సుమారు కోటీ 60 లక్షల కుటుంబాల్లో అర్హులైన లబ్ధిదారుల కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేయటం జరుగుతుంది అని తెలిపారు.

## నాగచైతన్య జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ



**నందిగామ, డిసెంబర్ 18, మేజర్ న్యూస్:** తొర్లికొండ మల్లెలనాగచైతన్య ఏడవ వర్ధంతి జ్ఞాపకార్థంగా వందమంది నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఇదే రోజు ఏదో ఒక మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నామని,విద్య ద్వారా ఇబ్బంది పడుతున్న పిల్లలకు అనేకమందికి హెల్ప్ చేశామని తెలిపారు. ఆమె తల్లిదండ్రులు తొర్లికొండ వెంకట్రావు,వెంకట నరసమ్మ సౌజన్యంతో ఈ సంవత్సరం చలికి ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు దుప్పట్లు శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నందిగామ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య,నకిరికంటి నరేష్, మారం సత్యనారాయణ, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బండారు కేదార్నాథ్ శర్మ,శ్రీనివాసరావు, వినుకొల్లు నవీన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి గెలిపించాలి



అవనిగడ్డ మేజర్ న్యూస్ : రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించి రాష్ట్రానికి మంచిరోజులు తీసుకురావాలని, సైకోని గద్దె దింపి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్య క్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. సోమవారం స్థానిక వైశ్యా కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచిపెట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు గురించి ప్రజలకు తెలియచేసారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, రాష్ట్రం మరలా ప్రగతిపధాన నడవాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రానుందని అన్నారు. జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలలో వ్యతిరేకత పూర్తిస్థాయిలో కనిపిస్తుందని అన్నారు. దానికి నిదర్శనంగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగుల నిరసనలు, ప్రభుత్వ ఉద్యోగుల నిరసనలు అని అన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ బాగుపడాలంటే అందరం కలిసి తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై అక్ర మ కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని, రాష్ట్రంలో ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వారి గొంతు నొక్కుతున్నారని అన్నారు. తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని ప్రజలు అడుగగా, మరొక నాలుగు నెలలు ఆగితే మనందరి ప్రభుత్వం వస్తుందని, అభివృద్ధి కుంటుపడిన అవనిగడ్డ నియోజకవర్గంలో మరలా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వర రావు,యాసం చిట్టిబాబు, బండే రాఘవ,యలవర్తి ఆది, వేకనూరు గ్రామ ఉప సర్పంచ్ తుంగల మురళీకృష్ణ, బండే రాఘవ, అవనిగడ్డ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు బండే కనకదుర్గ, యాసం లంకమ్మ, అన్నపూర్ణమ్మ, మెగావతు గోపి, జనసేన నేతలు కొట్టి విజయ్, రెడ్డా త్ కృష్ణ బాబు, మత్తి శ్రీను, ఎర్రం శెట్టి మధు, ఎర్రం శెట్టి దామోదరం, గాజుల సుబ్బయ్య, బచ్చు కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి క్షేత్రంలో ఘనంగా ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం



మచిలీపట్నం, మేజర్న్యూస్ : పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించు కొని స్థానిక శ్రీ వాసవి క్షేత్రములోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయములో ఆదివారం ఘనంగా ప్రారంభమైనవి. సోమవారం అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా, మంజులత దంపతులు వారి కుమార్తె ప్రేమాన్విత ల తోటి శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు,18 రకాల ద్రవ్యములతో అభిషేకాలు, భోగం కార్యక్రమాలను శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ సలహాదారులు కొల్లూరి మంజులత, సభ్యులు తిరుప్పావై చదివారు. అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు తమ్మన వెంకట సుబ్బారావు కార్యదర్శి కోడూరి రమేష్ పట్టణ వర్తక వాణిజ్యమండలి నాయకులు మామిడి శ్రీరామచంద్రమూర్తి, తమన తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్ఐ చర్చికి యార్లగడ్డ రూ.లక్ష సాయం



గన్నవరం, మేజర్ న్యూస్ : గన్నవరం మండలం అజ్జంపూడి సీఎస్ఐ చర్చి నిర్మాణానికి తెదేపా నియోజకవర్గ ఇన్ ఛార్జ్ యార్లగడ్డ వెంకట్రావు రూ.లక్ష ఆర్థిక సాయంగా అందజేశారు. ఈమేరకు నగదును పరిశుద్ధ యోహాను సీఎస్ఐ చర్చి సంఘ పెద్దలకు వెంకట్రావు సోమవారం అందించారు. ఈసందర్భంగా రానున్న సాధారణ ఎన్నికల్లో తెదేపా విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దాత యార్లగడ్డకు సంఘ పెద్దలు, విశ్వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 20న గన్నవరంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం



గన్నవరం, మేజర్ న్యూస్ : అయోధ్య తీర్థక్షేత్ర అభియాన్‌లో అయోధ్య నుండి వచ్చిన శ్రీరాముని పూజా అక్షింతలు గన్నవరం శ్రీ భువనేశ్వరి పీఠం కు చేరుకున్నాయి. ముందుగా భువనేశ్వరి పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతీస్వామి వారి చేతులమీదుగా వృద్ధి కార్యక్రమం చేపట్టి తదుపరి వాటిని కలశాలలో నింపి భక్తుల చేత కలశాలతో శోభయాత్ర జరిగింది. భక్తుల శ్రీరామ జపంతో ఈ కార్యక్రమం చాలా కోలాహలంగా జరిగింది. ఈ నెల 20న గన్నవరంలో జరగబోవు హిందూ సమ్మేళనం కార్యక్రమంలో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో అన్ని గ్రామాలకు అయోధ్య రాముని అక్షింతలు వితరణ జరుగుతుంది అని ఈ కార్యక్రమ నిర్వాహకులు శ్రీ వెలుగంటి శివాజీ తెలిపారు. ఈ కార్యక్రమం లో గన్నవరం నుండి చిగురుపాటి కుమారస్వామి, శేషుకుమార్, జయశంకర్, పాండురంగారావు, భక్తవత్సలమ్, సురేష్, శ్రీనివాస్, అనిల్ అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రతకు వేలాది కోట్లు ఖర్చు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్య భద్రత కల్పించేందుకు డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకానికి వేలాది కోట్లు ఖర్చు చేస్తోందని.. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 2019, ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు వివిధ రకాల చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం రూ. 427 కోట్లు ఖర్చు చేసినట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం, ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ.. కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద చికిత్సల వ్యయ పరిమితిని రూ. 25 లక్షలకు పెంపు, స్మార్ట్ ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్, ప్రజాప్రతినిధులు.. లబ్ధిదారులకు స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొప్ప పథకాలైన ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలకు ఏడాదికి రూ. 4 వేల కోట్లు ఖర్చుచేస్తోందన్నారు. ఇప్పుడు వ్యయ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ వంటి కొత్త ఫీచర్లతో రూపొందించిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాకు సంబంధించి 5,36,592 కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్డుల పంపిణీతో పాటు మెగా డ్రైవ్ ద్వారా ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నామని.. మొబైళ్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని 2024, జనవరి 1 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌ఛైర్మన్ మల్లాది విష్ణువర్ధన్, పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేన్సర్ వంటి వాటికి పూర్తిస్థాయిలో చికిత్స లభించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని.. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఎంతో మేలు జరిగిందని.. బీపీ, షుగర్ తదితరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, తగిన వైద్య సేవలు అందించేందుకు వీల యిందన్నారు. జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్య క్రమం ప్రారంభం కానుందని.. మందులను కూడా ఉచితంగా ఇళ్ల వద్దకే అందించే కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. విజయ వాడ ప్రజల తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.శివరామకృష్ణ, రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ వైస్ ఛైర్మన్ డా. డేనియల్, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, ఎ.శ్రీశైలజారెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైద్యాధికారులు, లబ్ధిదారులు హాజరయ్యారు.



## స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

మచిలీపట్నం, మేజర్న్యూస్ : స్పందన అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో శ్రద్ధ వహించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం ఆర్డీఓ ఎం.వాణీలతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీ ఏ ద్వామా పిడి లు పిఎస్ ఆర్ ప్రసాద్, సూర్య నారాయణ, డిఎంహెచ్ ఓ డాక్టర్ గీతా బాయి, డిపిఓ నాగేశ్వర్ నాయక్, ముదావిసి రాజ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి జే. జ్యోతి, ఏపీ ఎంఐపి పిడి విజయలక్ష్మి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



మచిలీపట్నం, మేజర్న్యూస్ : విద్యుత్తు ఎంతో విలువైనదని వృధా కాకుండా పొదుపుగా వాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుపుకుంటున్నామన్నారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా చేయవచ్చని, సాంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఈడి బల్బులను వాడుకోవాలని, తద్వారా 60 శాతం పైగా విద్యుత్తును ఆదా చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు రిమోట్ తో ఆపి స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. నేటి సత్ సంకల్పం రేపటి వెలుగులకు సాకారం అవుతుందన్నారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ స్టార్లు కలిగిన గృహోపకరణాలను వినియోగించి 30% కరెంటు బిల్లు, ఇంధనం ఆదా చేసుకోవచ్చన్నారు. కరెంటును ఆదా చేసి భావితరాలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టి విద్యుత్ పొదుపును తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పెద్ది రోజా, ఆర్డీవో ఎం వాణి, ఏపీసిపిడిసి ఎల్ భాస్కరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మైనార్టీ హక్కుల పరిరక్షణ దినోత్సవం



మచిలీపట్నం, మేజర్న్యూస్ : సోమవారం స్థానిక 33వ డివిజన్ లో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉర్దూ నందు ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులు 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ, జనాబ్ సదురుద్దీన్ ఖురేషి, డైరెక్టర్ అర్బన్ బ్యాంక్ మీర్జా రియాజ్ హుస్సేన్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు ఎండి రబ్బాని, 27వ డివిజన్ ఉమా, సచివాలయ వీఆర్వో, పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ సల్మా, సిఆర్పియు న్యూస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మైనార్టీలకు గొప్ప వరం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఉర్దూ భాషని రెండో భాషగా గుర్తించడం తద్వారా మనము కార్యాలయాల్లో మరియు అన్నిచోట్ల ఉర్దూ భాష పట్ల అవగాహన కల్పించుకోవాలని, మైనార్టీల హక్కులను నిరంతరం కాపాడుకోవాలన్నారు.

# ప్రజల స్థిరాస్తులు నష్టం కల్గించే చట్టాన్ని రద్దు చెయ్యాలి

**గుడివాడ, మేజర్ న్యూస్:** ప్రజల స్థిరాస్తులకు నష్టం కల్గించే 27 ఆఫ్ 2023 ఏపీ టైటిలింగ్ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని గుడివాడ బార్ న్యాయవాదులు కోర్టు ఆవరణలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ కార్యదర్శి వెంకట రమణ మాట్లాడుతూ కోర్టుల ప్రమేయం లేకుండా రెవెన్యూ అధికారుల సమక్షంలోనే భూ సమస్యల పరిష్కారాన్ని మధ్యవర్తులతో ట్రిబ్యునళ్ల తీసుకురావడం విడ్డూరమన్నారు. ఈ విధానంతో భూసంబంధ సమస్యలు రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లోకి వెళ్ళే ప్రమాదం ఉందన్నారు. దీనివలన పేద రైతులు రాజకీయ వత్తిళ్లకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో కోర్టుల జోక్యాన్ని పూర్తిగా లేకుండా చేయడంతో పేద రైతులు తమ స్థిర ఆస్తులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అధికారుల తప్పిదంతోనే భూసంబంధ కేసులు అన్ని కోర్టుల్లో సింహభాగంలో కొనసాగుతున్నట్లు చెప్పారు. కోర్టుల జోక్యంతో అయినా చివరికి పేద రైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఇప్పటి వరకు ఉందని, ఈ చట్టంతో ఇకపై అలాంటి పరిస్థితి లేక పేద రైతులు తీవ్రంగా నష్టోతారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించి వెంటనే ఏపీ టైటిలింగ్ చట్టం 27 ఆఫ్





2023ని వెంటనే ఉపసంహరించుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని రద్దుచేసేవరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు. మొదటి రోజు దీక్షలో న్యాయవాదులు బాజీఖాన్, కిరణ్, రఫీ, రాధాకృష్ణ, వీరయ్య, రాజేష్, సూర్యారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జీ, గుత్తా శివరామకృష్ణ, పలువురు నాయకులు, దళిత నాయకులు పొంగులేటి జయరాజు వంటివారు దీక్షకు మద్దతు ప్రకటించి, న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు.

# 22, 23 తేదీల్లో కలెక్టర్లతో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణపై సమీక్ష



## హాజరుకానున్న భారత ఎన్నికల సంఘం అధికారులు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రత్యేక సంక్షిప్త సవరణ – 2024లో భాగంగా జనవరి 5న తుది జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో వివిధ దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుకుణంగా గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకి వివరించారు. సచివాలయంలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి సోమవారం ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం – 2024, రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, అనోమలిస్, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, నగర పోలీస్ కమీషనర్ కాంతి రానా టాటా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ – 2024 తుది దశ కార్యకలాపాలలో భాగంగా కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను అత్యంత పారదర్శకంగా జవాబుదారీ తనంతో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో జరగనున్న సమీక్షా సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రతినిధుల బృందం కూడా సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సదస్సును విజయవంతం చేసేందుకు నోడల్ అధికారిని, సమన్వయకర్తలను నియమించినట్లు వివరించారు. జిల్లాకు సంబంధించి ప్రత్యేక సంక్షిప్త సవరణ పురోగతిపై పూర్తీ సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకి జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీసీపీలు విశాల్ గున్ని, అజిత వేజెండ్ల, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సిహెచ్. దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




# ఉద్రిక్త వాతావరణంలో అంగన్వాడి వర్కర్స్ నిరసన

**నందిగామ, డిసెంబర్ 18, మేజర్ న్యూస్:** అంగన్వాడి నిరసన ఏడవ రోజు నందిగామ,జగ్గయ్యపేట నియోజకవర్గాల నుండి సుమారు వెయ్యి మందికి పైగా అంగన్వాడీ వర్కర్స్ నందిగామ ఆర్డీఓ కార్యాలయం వద్ద కు తరలివచ్చారు.కార్యాలయం లోపలికి రావడానికి ప్రయత్నించడంతో పోలీసులు సాయంత్రం వరకు ఉద్రిక్తంగా ఆందోళన కొనసాగింది.ఆర్డీఓ కార్యాలయం నుంచి గాంధీ సెంటర్, భారత్ టాకీస్ సెంటర్,పాత బస్టాండ్ సెంటర్,మెయిన్ బజార్ మీదుగా గాంధీ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన ముందుకు సాగింది.నందిగామ ఆర్డీఓ కు విన తి పత్రం ఇవ్వటానికి ఆర్డీఓ కార్యాలయం లోపలికి వెళ్లటానికి అంగన్వాడీ వర్కర్స్ తోసుకు రావడం తో పోలీసులు అడ్డుకున్నారు. ఎట్టకేలకు 25 మంది అంగన్వాడీ నాయకులు, సిఐటియు నాయకులకు అనుమతించారు. నందిగామ ఆర్డీఓ సాయిబాబుకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ లు వివరించారు. ఆర్డీఓ సాయిబాబు సానుకూలంగా స్పందించారు.తొలుత అంగన్వాడీ వర్కర్స్ ను ఉద్దేశించి సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ పట్ల నిర్లక్ష్యంగా జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు.కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ 3లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించక పోతే ఆందోళన దశలవారీగా మరింత ఉధ్రతం చేస్తామని హెచ్చరించారు.కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ అంగన్వాడీ



వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయటంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ప్రజా సంఘాలు పూర్తిగా మద్దతు పోరాడి అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కారం కోసం పోరాడతామని తెలిపారు.ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు తిరుమల దేవి,కనక దుర్గ తదితరులు సంఘీభావం తెలిపారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, సోమెజు రామనాథం,దారా నాగేశ్వరరావు,రాము లాల్ అహమ్మద్ గౌస్, బచ్చలికూర లాజరు, సయ్యద్ ఖాసిం,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్,వేల్పుల ఏసోబు,జంగా దామోదర్, షేక్.గౌస్ మియా, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు కాకాని సువర్ల,కొల్లి సరళ, సుజాత,లక్ష్మీ,వెంకట్రామ్మ తదితరులు నాయకత్వం వహించారు.



## ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి కార్యక్రమాలు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం మెయిన్ రోడ్ లో ఉన్న శ్రీ పర్వత వర్ధని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంనందు సోమవారం సుబ్రమణ్యషష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు కళ్యాణాలు నిర్వహించారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం అధ్యక్షులు తనికెళ్ల హరినాథ్ మరియు భక్తుల సహకారంతో స్వామివారికి ఆలయ అర్చకులు జి భాస్కర శర్మ ఉదయం గణపతి పూజ, మహాన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం( 11రకాల ద్రవ్యములతో), సుబ్రహ్మణ్యస్వామి హోమం అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి వేలాది మంది భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తర్వాత జరిగిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బ్రహ్మశ్రీ జొన్నలగడ్డ శ్రీనివాసు, బ్రహ్మశ్రీ లొల్లా కుటుంబ శాస్త్రి, బ్రహ్మశ్రీ లక్కావఝ్ఝుల రామకృష్ణ, బ్రహ్మశ్రీ రెందుచింతల సూర్యనారాయణ,బ్రహ్మశ్రీ తంగిరాల సుబ్రహ్మణ్య కుమార్, బ్రహ్మశ్రీ లంక కుమార్ శాస్త్రి, బ్రహ్మశ్రీ కృత్తివెంటి కనకదుర్గ ప్రసాద్, కార్య నిర్వహణ అధికారి పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



**విజయవాడ, మేజర్‌న్యూస్ :** స్థానిక చోరగుడి గ్రామంలో షేరింగ్ అండ్ కేరింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కందిమళ్ళ పూర్ణకుమారి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా పూర్ణకుమారి మాట్లాడుతూ మన చుట్టూ అవసరంలో ఉన్న పేదలకు చేతనైన సహాయం చేయాలనే ఈ సంస్థ ఆలోచన అభినందనీయమని భవిష్యత్తులో కూడా ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రజలందరూ కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శీలం.రత్నరాజు, చోరగుడి సహకార సంఘం మాజీ అధ్యక్షులు కత్తిక నాగేశ్వరరావు,బ్రాహ్మిణ్ పార్లమెంట్ రాష్ట్ర అధ్యక్షులు దినవాహి ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు హసన్ అహ్మద్, సీనియర్ పాత్రికేయులు జానపాటి.వెంకటప్పయ్య, పువ్వుల లక్ష్మీనారాయణ, అమ్మి రెడ్డి శివయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరులపాడుకు 18 ట్యాంకర్లు అందజేసిన ఎంపీ నాని



**నందిగామ, డిసెంబర్ 18, మేజర్ న్యూస్:** నియోజకవర్గం వీర్లపాదు మండలంలో 18 గ్రామాలకు తాగునీటి అవసరార్థం ఎంపీ నిధులతో మంచినీటి ట్యాంకర్లను అందించిన గౌరవ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ నాని అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఇప్పటికే సుమారుగా 150 గ్రామాలకు ట్యాంకర్లను అందజేశాము.ఇంకా 150 గ్రామాలకు మంచినీటి ట్యాంకర్లను అందించనున్న అన్న ఎన్టీఆర్, చంద్రబాబు స్ఫూర్తితో ప్రజలకు మంచి చేయడమే నా కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ అన్నా, పొన్నం రవి ,మాజీ జెడ్పిటిసి సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్, దాములూరు మధుసూదన్ రావు, మాజీ ఎంపీపీ జైపాల్, కన్నెకంటి జీవరత్నం, నర్సానేని మురళి,ఎక్కిరాల హనుమంతరావు, బడే హజరాత్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ఈవూరి వినోద్ , వేజెండ్ల వంశి,నందిగామ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.